తురగా (మోచర్ల) జయశ్యామల

పట్టుచీర

చాలా సేపటినుంచి తల్లి తనకు పక్కపక్కనే తిరగడం గమనించకపోలేదు సూర్యం. ఆవిడ ఏదో తనతో చెప్పాలనుకోవడం, చెప్పలేకపోతూండడం కూడా గుర్తించాడు, ఓ పక్క పేపరు చదువుతూనే. తప్పనిసరయి ఏదో విషయం చెప్పాల్సివస్తే తప్ప, తల్లి అంతగా తడబడుతూ తచ్చాడదని పూర్తిగా తెల్సు సత్యం”.

అందుకే పేపరు పేజీ తిప్పుతూ “ఏమిటమ్మా!” అంటూ ప్రశ్నించాడు సూర్యం.

సూర్యం అలా అడగగానే సుందరమ్మగారి ముఖం సంతోషంతో యింతైంది. “అబ్బే ఏం లేదురా! ఇప్పుడే వస్తానుండు!” అంటూ ఒక్కవుదుటున పక్క గదిలోకి వెళ్ళి తిరిగి వచ్చింది. “చూడబ్బాయ్! కంచిపట్టు చీర. భాస్కరరావుగారి భార్య కంచి, రామేశ్వరం అవీ వెళ్ళివచ్చింది కదూ! కంచిలో ఈచీర కొనుక్కువచ్చిందట!” అంటూ చేతిలోని చీరను సూర్యానికందించింది ఆవిడ.

బంతిపూరంగు చీరకి జానెడు వెడల్పున ఆకుపచ్చని జరీఅంచు పట్టుచీరని మడత విప్పి చూస్తూ, “బావుందమ్మా! ఖరీదెంతేమిటి?” అనడిగాడు. నిజానికా చీర రంగు, అంచు సూర్యానికి కూడా

చాలా నచ్చింది. యింక సుందరమ్మగారి మాట వేరే చెప్పేదేముంది.

"నాలుగొందలు పైనే అయిందట.."

"చాలా బాగుందమ్మా !" అంటూ చీరని తల్లి చేతుల్లో పెట్టేసాడు సూర్యం.

"ఎంతయినా కంచిపట్టు చీరల రంగులు అంచులు బాగుంటాయి. ఈ చీరలు కట్టుకుంటే మనిషికి ఎంత నిండుతనం ఇచ్చేయ్యనా అబ్బాయ్ !"

"ఇచ్చెయ్యమ్మా !" అన్నాడు సూర్యం తల్లి వేపు చూడకుండానే.

సూర్యం అలా అనగానే సుందరమ్మ గారిలో అంతవరకు పొంగుతున్న ఉత్సాహం మీద చన్నీళ్ళు చిలకరించి నట్లయింది. ఆమె ఆశించిన మాట సూర్యంనుంచి రాకపోవడంతో, నిరాశ పడిపోయినట్లు ఆమె ముఖమే చెబు తూంది. ఆ చీర పక్కింటి భాస్కర రావుగారి భార్య కిచ్చిరావడానికి వెళ్ళా రావిడ.

తల్లి అలా వెళ్ళగానే వికలమయిన మనసుతో సూర్యంకి యింక పేపరు చదవబుద్ధి కాలేదు. పేపరు మడిచి పక్కన పడేసాడు. గుండెల్లో ఏమిటో బాధగా అనిపించింది, తల్లిని తల్చుకో గానే. రివ్వున కన్నీళ్ళు కూడా దూసుకు రాబోయాయిగాని, ఎలాగో ఆపుకున్నాడు సూర్యం. తల్లి ఆ చీర తెచ్చి తనకు చూపించటంలోగల అంతర్యం గ్రహిం చక పోలేదతను.

సుందరమ్మ కోరిక ఈనాటిదా ? చిరకాలంగా ఆమెలో దాగివున్న కోరిక... వయసుతో బాటు మనసులో పెరిగిన కోరిక. ఆమె జీవితంలో చిన్నప్పుడు కన్నతండ్రిని గాని తర్వాత కట్టు కున్న భర్తనుగాని కన్నపిల్లలనుగాని ఆమె కోరింది అదొక్కటే కోరిక. అదే కంచిపట్టుచీర కొనిపెట్టమని. కాని, యింతవరకూ ఆవిడ కా కోరిక తీరనే లేదు.

ఆనాడు ఆవిడ తండ్రి ఓ పల్లెటూర్లో కరణం. బంధు బలగం కావల్సినంత. వచ్చేవాళ్ళు, వెళ్ళేవాళ్ళు, ఏ రోజూ యిల్లు సత్రంలా, పెళ్ళివారిల్లులా వుండేది. సుందరమ్మకి చీరలుకట్టుకునే వయసు రాకుండానే పెళ్ళిచేసాడామె తండ్రి. కూతురు చీరలు కట్టుకోవచ్చే టప్పటికి ఏవో సాదాచీరెలు కొనిపెట్టడం తప్ప పట్టుచీరలు కొనే తాహతు ఆయ నకు లేకపోయింది.

తర్వాత అత్తగారింట్లోను అంతే యిక్కడ పుట్టింట్లో మాదిరే. తన అన్న పడుచులే గాక, అత్తగారి వైపువాళ్ళు మామగారి వైపువాళ్ళు, ఆయన చెల్లెళ్ళు, మేనత్తలు, మేనత్తలకూతుళ్ళు . వాళ్ళ రాకపోకలు, మర్యాదలు, పెట్టుపోతలు వీటన్నిటి మధ్య సుందరమ్మకు పట్టు చీర మాట కల్లోకూడా అనుకోడానికి వుండేది కాదు. మర్యాదలో కొండంత ఆస్తి హారతికర్పూరంలా కరిగిపోగా,

మాధవరావుకి మాస్టారుగిరీ మాత్రం మిగిలింది, జీవనాధారానికి. మాధవరావు తండ్రి కొడుకుకి ఎలాగో తను చనిపోయే నాటికి రెండెకరాల పొలం మాత్రం పిత్రార్జితంగా మిగిల్చాడు.

"కాపరానికి వచ్చిన వెంటనే ఒక్కొక్కరుగా వరుసగా అయిదుగురు పిల్లలు బయల్దేరారు సుందరమ్మకు. వాళ్ళని పెద్దచేయాలనే తాపత్రయంలో పడ్డా, సుందరమ్మ మనసులో కోరిక చెదురు మదురుగా కదులుతూనే వుండేది.

"ఏమండీ! మిమ్మల్ని నేనెప్పుడూ ఏమీ కోరలేదు. ఇంక ముందు కోరను. ఒక మంచి కంచిపట్టుచీర కొని పెట్టండి!" అంటూ భర్తను ఎన్నో సార్లు అడిగింది.

సంసారం ఈదడానికే ఎప్పటికప్పుడు తలమునకలయిపోతున్న మాధవరావు "అలాగే! ఈసారి తప్పకుండా, తల తాకట్టు పెట్టయినా సరే కొనిపెడతాను!" అనేవాడు.

అలా అన్నాక కూడా ఎన్నో సంవత్సరాలు అవలీలగా గడిచిపోయాయి. తల తాకట్టుపెట్టడ మెలాగో, భార్యకు చీర కొనడ మెలాగో తెలియలేదు. నోరు తెరిచి భార్య కోరిన ఒక్కగానొక్క కోరిక తీర్చలేకపోతున్నందుకు మనసులోనే బాధపడేవారాయన.

సుందరమ్మగారు పట్టుచీర కొనుక్కోలేదని కాలం ఆగిపోలేదు.

పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. చదువుకొంటున్నారు. అందర్లోకి పెద్దవాడు సత్యం. తెలివయినవాడు. క్లాసులో అన్నిటిలోనూ ఫస్టుమార్కులు వాడికే. అందుకే వాడి నెలాగైనా పెద్ద చదువులు చదివించాలనుకున్నారు. వున్న వూళ్ళో కాలేజీ లేకపోయినా పొరుగూరికి పంపించి పెద్దచదువులే చదివించారు.

తను నోరుతెరిచి అడగకపోయినా, కొడుక్కి ఉద్యోగం వస్తే మొదటి జీతంలోనే తనకు పట్టుచీర కొనిపెడతాడనుకున్నది సుందరమ్మ. ఆవిడ అనుకున్నట్లు కోరుకున్నట్లు సత్యంకి మంచి ఉద్యోగమే వచ్చింది. కాని తల్లి అనుకున్నట్లు పట్టుచీర కాదు కదా, ఓ నేతచీర కూడా కొనిపెట్టలేదావిడకు. వచ్చిన జీతంలో ఘనంగా ఎలా బ్రతకాలా అన్న ఆలోచన తప్ప మరో ఆలోచనలేదు సత్యంకి. చీర కొనిపెట్టమని నోరుతెరిచి కొడుకుని అడగటం ఆవిడకు అభిమానం అనిపించింది. అలాగే అడగలేదు కూడా. యిప్పుడు సత్యం తనాఫీసులో పని చేస్తున్న ఒకమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకొని సంతోషంగా, సుఖంగా రోజులు దొర్లించేస్తున్నాడు బొంబాయిలో. గుర్తు వచ్చినప్పుడు తన క్షేమం వాళ్ళకి తెలిపి తల్లితండ్రుల క్షేమం కనుక్కొంటూ వుంటాడు వుత్తరం రాసి.

తండ్రి, భర్తల హయాంలో తన కోరిక తీరకపోయినా, కన్నకొడుకు



తప్పక తీరుస్తాడని ఆశపడిన సుందరమ్మ ఆశ నిరాశ అయింది. అయినా ఆవిడ కోరికను చంపుకోలేకపోయింది. సత్యం తర్వాత శుభ. దాని పెళ్ళికయినా కొనుక్కోవాలని గట్టిగా నిర్ణయించుకుందావిడ. శుభపెళ్ళి కుదిరింది, మూడు వేల కట్నంతో. వున్న రెండెకరాలలో ఓ ఎకరం పొలం అమ్మి శుభ పెళ్ళి చేయాలని నిర్ణయించుకున్నారు మాధవరావు.

"అమ్మా! ఖర్చులో ఖర్చు. నువ్వు ఓ పట్టుచీర నీకు నచ్చినది తీసుకో" అన్నారు పిల్లలందరూ.

"ఆ! యిప్పుడు నాకు పట్టుచీరకు తొందరేమొచ్చిందర్రా! ఈసారెప్పుడయినా కొనుక్కుంటాలే! దాని పెళ్ళి నిర్విఘ్నంగా సాగి, లక్షణంగా అత్తవారింటికి వెళితే నాకంతకంటె కావల్సిందేముంది?" అంది సుందరమ్మ.

"అదేమిటమ్మా! ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్నావ్! నాలుగు డబ్బులు చేతిలో వుండగానే కొనుక్కో!" అంది శుభ.

"పిచ్చి మొహమా! నీకేం తెలుసు. ఆడపిల్ల పెళ్ళంటే మాటలా? నేను పట్టుచీర కట్టుకూర్చుంటే ఏమొస్తుందే! నీకెలాగూ చీరలు కొనాలి కదా! ఆ డబ్బుతో నాకో పట్టుచీర వస్తుంది. అవసరానికి పరుగులు పెడితే ఎక్కడనుంచి వస్తుంది. నాలుగు రూపాయలు చేతిలో మిగుల్చుకోవడమే మంచిది. నీ తర్వాత సత్య వుందిగా. దాని పెళ్ళిలో కొనుక్కుంటాలే!" అంటూ దాటవేసింది. గుంటూరు జరీఅంచు నేతచీరలో శుభ వివాహం అయిందనిపించింది సుందరమ్మ.

శుభ తల్లినెప్పుడయినా తనింటికి తీసుకువెళ్ళి ఓ పట్టుచీర పెట్టాలని వుంది

గావి, అది ఆమె తాహతుకి మించిన పని. శుభ అత్తవారు మధ్యతరగతి కుటుంబీకులే.

తర్వాత రెండేళ్ళకే సత్య వివాహం కుదిరింది. ఈ సంబంధం వీళ్ళ తాహతుకి మించినదనే చెప్పవచ్చు. అదృష్టం కలిసి వచ్చింది. సత్య నచ్చిందని వాళ్ళు ఒప్పుకున్నారు. ఆరు వేలు కట్నం. కలిగిన కుటుంబంలో పడితే అమ్మాయి సుఖపడుతుందని, ఆ సంబంధం ఖాయం చేసారు మాధవరావుగారు. వున్న ఎకరం పొలం అమ్మడమే కాకుండా, అప్పు కూడా చెయ్యాల్సి వచ్చింది. వియ్యాల వారు కలిగినవాళ్ళు. అమ్మాయికి పెట్టే సారె చీర వియ్యాలవారికి పెట్టుపోతలన్నీ ఘనంగా వుండాలి.

"ఎలాగూ సత్య పెళ్ళికి పదివేల వరకూ ఖర్చవుతూంది. ఓ నాలుగొందలు పెడితే నీకు పట్టుచీర వస్తుంది. కొనుక్కో!" అన్నాడు భార్యతో మాధవరావుగారు.

సుందరమ్మ నవ్వింది భర్త మాటలకు. "మీరు తెలివివుండే మాట్లాడుతున్నారా? సత్య పెళ్ళి ఏ విధమైన అలజడులూ లేకుండా జరగనీండి. దాని అత్తవారు ఏ విధంగానూ అసంతృప్తి చెందకుండా వుంటే నేను పట్టుచీర కట్టుకున్నంత తృప్తి. ఆ చీరడబ్బువుంటే సత్య ఆడపడుచు లాంఛనాలపైన కల్సి వస్తుంది!" అంది.

సత్య అత్తవారింటికి వెళ్ళిపోయాక పూర్తిగా మారిపోయింది. యిప్పుడామెకు పుట్టింటివారి లేమితనం చూస్తే చిరాకు. ఎప్పుడేనా వస్తుంది. పుట్టింటివారు కలిగినదాంట్లో పెట్టిన సారె, చీర ఆమెకు నచ్చవు. తమ అంతస్తుకి తగినవికావని గునుస్తుంది.

వారిద్దరి వివాహాలు అయి అత్తవారింటికి వెళ్ళేనాటికి మాధవరావుగారు రిటైరయ్యారు. వున్న పొలం కరిగిపోవడమేకాకుండా, అప్పు మిగిలింది. దాంతో సూర్యం చదువు ముందుకు సాగలేదు. ఇంటరుతో చదువు ఆపేసి ఉద్యోగ ప్రయత్నంలో పడ్డాడు. సర్వీసు కమీషను పరీక్షలు రాసి, అన్ని టెస్టుల్లోనూ ప్యాసై ఎలాగైతేనేం ఏ.ఎస్.ఎమ్. (అసిస్టెంటు స్టేషను మాస్టరు) గా ఉద్యోగం సంపాదించాడు. యిప్పుడతని జీవితం ప్లానల్ బోర్డుకి, రైలుపట్టాలకి అంకితమైపోయింది.

* * *

సూర్యం ఉద్యోగం రాగానే తల్లికి పట్టుచీర కొనాలని చూసాడు. కాని, సుందరమ్మే అంగీకరించలేదు. తల్లి తండ్రులేగాక మరో పెళ్ళి కావల్సిన చెల్లెలు నిత్యని పోషించాల్సిన బాధ్యత అతనిమీద పడింది. నిత్యం మండిపోతూ, ఆకాశానంటుతున్న ధరలలో ఆ జీతం రాళ్ళమీదే ఆధారపడిన వాళ్ళకి పట్టు చీరలు కొనడం ఎలా జరుగుతుంది?

'మరెప్పుడయినా కొందువుగా నిలే!' అంది సుందరమ్మ. ఆ తర్వాత తర్వాత అలాగే జరిగిపోయింది. సూర్యానికి వివాహం అయింది. యిప్పుడతనికి ముగ్గురు పిల్లలు. ఇద్దరాడపిల్లలు, ఒక మగపిల్లవాడు.

నిత్యకి సంబంధాలు చూస్తున్నాడు. చివరి కెలాగయితేనేం నిత్యకి ఒక సంబంధం ఖాయంచేసాడు సూర్యం. నిత్య పెళ్ళికి అన్నగారేమయినా ధన సహాయం చేస్తాడేమోనని రాసాడు సూర్యం. కాని, అతని నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. పూర్తిగా ఆశ వదిలేసుకున్నాడు సూర్యం. తానే ప్రావిడెంటు ఫండులోంచి లోను తీసుకొని నిత్య పెళ్ళి జరిపించాలని నిర్ణయించాడు సూర్యం.

ఆరోజు వస్తూనే, "అమ్మా" అంటూ సంతోషంగా, పెద్దగా పిలిచాడు సూర్యం.

"ఏమిటి నాయనా!" అంటూ వచ్చిన తల్లి చేతిలో ఓ ప్యాకెట్టు పెట్టి, "ఏమిటో చూడమ్మా!" అన్నాడు సూర్యం.

సుందరమ్మ ఆత్రుతగా విప్పి చూసింది. ఆ ముఖం ఆనందంతో విచ్చుకుంది. కళ్ళల్లో మెరుపు కొట్టొచ్చినట్లుగా కన్పించింది. పట్టుచీర బంతి పూరంగు చీరకి ఆకుపచ్చ జరీఅంచు... ఆవిడకి సంతోషంతో నోట మాటరాలేదు. ఆనందంతో కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే, కొడుకు వంక ఆప్యాయంగా చూసిందావిడ.

తల్లి సంతోషాన్ని చూస్తుంటే సూర్యంకి మనసు ఆర్ద్రమైపోయింది. "పనిలో పని నిత్యకు చీరకొంటూ నీకూ కూడా కొనేసానమ్మా. ఎప్పుడూ ఇలాగే బౌతూంది" సూర్యంకి కూడా సంతోషంతో మాటలు రావడంలేదు.

"సూర్యం నాకు పట్టుచీర కొన్నాడు" అంటూ యింట్లోవాళ్ళకి, బయటవాళ్ళకి కూడా చూపించి వచ్చింది సుందరమ్మ.

ఆ పట్టుచీర చూసిన సూర్యం పెద్ద కూతురు రమ, "నాయనమ్మా! నీ చీర బావుంది. నాకు కూడా పట్టుపరికిణీ కావాలి," అంటూ అడిగింది.

"అలాగే! ఈసారి నాకు పట్టు పరికిణీ కొంటానమ్మా" అంటూ మెల్లిగా బుజ్జగిస్తున్నట్టుగా అన్నాడు సూర్యం.

"ఊహూ నా కిప్పుడే కావాలి!" అంటూ రాగం మొదలుపెట్టింది. అందరూ తలోరకంగా చెప్పి చూసారు. అయినా వినలేదు రమ. అంతకంతకు మంకు పట్టుగా మొదలెట్టింది. దానిని చూసి చిన్నపిల్ల సుధకూడా తనకీ పట్టు పరికిణీ కావాలంటూ ఏడుపు మొదలుపెట్టింది.

యిప్పుడున్న ఈ ఖర్చులలో ఆ చిన్నపిల్లలకు పట్టుపరికిణీలు కుట్టించ లేడు సూర్యం. ఆ సంగతి సుందరమ్మ గారికి తెల్సు. కాని, ఆ చిన్నపిల్లల ఏడుపు చూస్తూంటే ఆవిడ కెలాగో అన్పించింది. ఏదో ఆలోచించుకుని ఒక నిర్ణయానికి వచ్చిందావిడ.

ఆ రోజే షైలరు దగ్గరకు వెళ్ళి సూర్యం తనకు కొన్న పట్టుచీరని రమకి, సుధకి, శుభ పెద్దపిల్ల రేణుకి పరికిణీల క్రింద కుట్టించేసింది.

అది చూసి, "అదేమిటమ్మా! అలా ఎందుకు చేశావు!" సూర్యం ఎంతో బాధగా అడిగాడు.

"పోనీలే, నాయనా! చిన్నపిల్లలు ముచ్చటపడుతున్నారు. పెద్దదాన్ని నేను సర్దుకోకపోతే ఎలా?" నవ్వుతూ తోసి పుచ్చేసారావిడ.

యిన్నేళ్ళు గడిచినా సుందరమ్మగారి కోరిక తీరలేదు. ఆ కోరికను ఆవిడ మర్చిపోనూ లేదు.

సూర్యం మనసు బాధతో విలవిల్లాడింది. తల్లి ఆ పట్టుచీర తెచ్చి చూపించడంలోని అంతరార్థం అతనికి అవగతమైంది. ఆవిడ రెండు మూడు సార్లు ప్రత్యక్షంగా, ఎన్నోసార్లు పరోక్షంగా పట్టుచీర కావాలని సూచించింది. కన్నతల్లి ఆ కోరిక ఒక్కటి తీర్చలేని అతని అసమర్థత మీద అతని కోపం వచ్చింది. తండ్రి వృద్ధాప్యంలో అడుగుపెట్టాడు. ఏ రోజూ ఆయనేదో ఒక అనారోగ్యంతో బాధపడుతూంటారు. ఎప్పుడూ ఏవో బాధ్యతలు, బరువులు. మనస్సుకు క్షణం విశ్రాంతి లేకుండా చేస్తాయి. ఈసారి ఓ. టి. అయినాచేసి సరే అమ్మకు పట్టుచీర కొనాలి! అని గట్టిగా నిర్ణయించుకున్నాడు సూర్యం.

"ఇదుగో! మిమ్మల్నే. ఏంచేస్తున్నారూ? పీడి నవతలకి తీసుకెళ్ళండి కాసేపు. వెధవలు. ముద్దకూడా మింగనివ్వరు?" అంటూ అరిచింది శాంత వంటింట్లోనుంచి.

భార్య అరుపుకి వులిక్కిపడి, కుర్చీలోంచి లేచి వంటింటివేపు వెళ్ళాడు. శాంత భోజనం చేస్తూంది. పక్కనే పడి దొర్లి ఏడుస్తున్నాడు చంటాడు

"ఓరోరి! ఎందుకురా! అలా ఏడుస్తున్నావ్!" అంటూ వాడిని భుజాన వేసుకుని ముందు గదిలోకి వచ్చాడు.

అప్పుడే దొడ్డిగుమ్మంలోంచి లోపలకు వస్తున్న తల్లి కన్పించింది. ఆవిడ ముఖం ఎందుకో వాడినట్లుగావుంది. తల్లి మొహంలోకి సూటిగా చూడలేక పోయాడు, ఏదో తప్పుచేసినవాడిలా. 'అమ్మకు తప్పకుండా చీర కొనాలి,' మనసులో మరోసారి గట్టిగా నిశ్చయించుకున్నాడు.

"ఎందుకురా వాడలా ఏడుస్తున్నాడు! ఇలా యివ్వు!" లోపలకు వచ్చిన సుందరమ్మ సూర్యం చేతుల్లోంచి మనవడ్ని అందుకొని చంకనేసుకుంటూ, "ఏందకురా పిచ్చి సన్నాసీ! అంతలా ఏడుస్తున్నావ్! చూడు. కళ్ళు ఎలా ఎర్రబడిపోయాయో! నీకు రైలు చూపించనా?" మనవడి ముక్కు, కళ్ళు చీర చెంగుతో తుడుస్తూ వాడిని బుజ్జగించే

ప్రయత్నంలో పీధిలోకి తీసికెళ్ళింది సుందరమ్మ.

* * *

నెలరోజులు నిశ్శబ్దంగా దొర్లి పోయాయి.

ఓ రోజు ఉదయం తొమ్మిదింపావుకి రాయచూరు రేణిగుంట ప్యాసింజరు స్టేషను వదిలి వెళ్ళిపోయిన అయిదు నిమషాలకి ఇంటికి వచ్చాడు సూర్యం డ్యూటీనుంచి. అతనితో మరి ఇద్దరు వచ్చారు.

"నాన్నా! మనింటికి ఎవరొచ్చారో చూడండి!" సూర్యం కంఠంలో ఉత్సాహం ధ్వనించింది.

అప్పుడే స్నానం ముగించి వచ్చిన మాధవరావుగారు సూర్యం మాటలు విని, ఆ వచ్చిందెవరోనని చూసారు. కాని, ఎవరో గుర్తు రాలేదు. "ఎవర్రా!" అంటూ సూర్యంనే అడిగారు.

"గుర్తుపట్టలేదా, నాన్నా? చిట్టిబాబు. చిన్నప్పుడు మీ దగ్గర చదువుకున్నాడు. ప్రైవేటుకి కూడా వచ్చేవాడు!" గుర్తు చేసాడు సూర్యం. ఒక్క-క్షణం గుర్తు చేసుకుంటున్నట్లుగా చూసారాయన. ఇంతలో సుందరమ్మ వచ్చింది వంటింట్లో నుండి.

"అమ్మా! చిట్టిబాబు, భార్య వచ్చారు!" తల్లితో చెప్పాడు సూర్యం.

సుందరమ్మ తొందరగానే గుర్తు పట్టారు. "నువ్వటోయి చిట్టిబాబూ! చాలా మారిపోయావుసుమా! ఆ అమ్మాయి నీ భార్యా! రామ్మా, లోపలికి!" అని "ఏమిటలా చూస్తున్నారూ? యింకా గుర్తు రాలేదా? చిట్టిబాబండీ! అవతారంగా రబ్బాయి. మీ దగ్గర ప్రైవేటుకి కూడా వచ్చేవాడు!" అంటూ మాధవరావుగారికి వివరించి చెప్పారు.

"ఓహ్! అవతారంగారబ్బాయా! యిటెక్క-డ నుంచి వస్తున్నావయ్యా! ఎన్నేళ్ళో అయింది చూసి. గుర్తుపట్ట లేకపోయాను. ఏమనుకోకు!" అన్నా రాయన.

"ఫరవాలేదు మాష్టారూ! పెద్దవారయి పోయారు. మంత్రాలయం రాఘవేంద్ర స్వామివారిని చూసి వెళదామని వచ్చాం. సూర్యం ఈ స్టేషన్లో పనిచేస్తున్నాడని తెల్సింది. మిమ్మల్ని చూడాలనిపించింది. దిగేసాను!" అన్నాడు చిట్టిబాబు.

"మంచిపనే చేసావోయ్! అభిమానంతో చూడాలని వచ్చావు చాలా సంతోషం నాయనా!" మాధవరావుగారు ఆనందంగా అన్నారు.

"నా భార్య, దీపిక!" అంటూ పరిచయం చేసాడందరికీ. దీపిక అచ్చం దీపకళికలా అందంగా, పొందికగా వుంది. పెళ్ళయి ఎనిమిది సంవత్సరాలయినా పిల్లలు కలుగలేదుట. మంత్రాలయం రాఘవేంద్రస్వామిని దర్శించుకుంటే సంతానం కలుగుతుందని చెప్పారుట ఎవరో. అందుకని వచ్చారుట.

చిట్టిబాబు యిప్పుడు మద్రాసులో ఓ ఫర్టి లైజర్ కంపెనీలో పనిచేస్తున్నాడుట. దీపిక అందరిలోనూ కలిసిపోయి మాట్లాడింది. స్నానాలూ అవీ ముగించి భోజనాలకు కూర్చున్నారు.

భోజనాలు చేస్తున్నంతసేపు సుందరమ్మగారు, "చాలా పెద్దవాడివి, బుద్ధిమంతుడివి అయిపోయావ్! అమ్మాయ్! చిన్నప్పుడు ఎంత అల్లరి చేసేవాడని. ప్రైవేటుకి వచ్చేవాడా? కాలు ఒకచోట నిల్చేదికాదు. మాస్టారు ఒక్క క్షణం అటో యిటో వెళితేచాలు, ఏ జామచెట్లో, ఉసిరిచెట్లో ఎక్కి కూర్చునేవాడు. ఒకసారలా జామచెట్టు ఎక్కి, కాలుజారి కిందపడ్డాడు. పాపం! కాలుకి బాగానే దెబ్బ తగిలింది. అయినా సరే, ఎవరికోనూ చెప్పొద్దమ్మా అంటూ నన్ను బ్రతిమాలుకున్నాడు!" ఆవిడ చెబుతుంటె సూర్యం, చిట్టిబాబు గట్టిగా, హాయిగా నవ్వుకున్నారు.

భర్త చిన్నప్పటి ఘనకార్యాలు వింటూ దీపిక ముసిముసిగా నవ్వుకుంది.

"ఏ అల్లరుచేసినా, దెబ్బలు తగిలినా ఆ రోజులే బాగున్నాయమ్మా!" అన్నాడు చిట్టిబాబు.

సుందరమ్మ ఆ విషయం, ఈ విషయం మాట్లాడుతూనేవున్నా, ఆవిడ దృష్టి అంతా దీపిక కట్టుకున్న పట్టుచీరమీదనే వుండటం సూర్యం గుర్తించకపోలేదు. ఎందుకో అతని గుండెల్లో కలుక్కుమంది. శాంత అత్తగారిమీద కోపగించుకుంది.

"అమ్మాయ్! ఈ చీర కంచిపట్టు చీర కదూ!" ఎవరూలేకుండా చూసి దీపికని అడిగింది సుందరమ్మ.

"అవునండి. మా అమ్మావాళ్ళు పెళ్ళిలో పెట్టిన చీర ఇది!" చెప్పింది దీపిక.

"చీర చాలా బాగుందమ్మాయ్!" అన్నారావిడ.

ఆ సాయంత్రం నాలుగు గంటలకే మద్రాసుమెయిలుకి వెళ్ళిపోయారు దీపిక, చిట్టిబాబు.

ఆ రాత్రి సూర్యం డ్యూటీకి వెళ్ళబోతుంటే శాంత వచ్చి, "మీ అమ్మగారికి బొత్తిగా మతిపోతుందనుకుంటా! ఆ అమ్మాయి వచ్చినప్పటినుండి ఆమె చీరని ఒకటే ఎగాదిగా చూడడం. ఆ అమ్మాయి ఏమనుకుంటుంది. ఎంత పట్టుచీర కట్టుకోవాలని వుంటేమాత్రం అంతగా బయటపడిపోవాలా?" అంది.

"పోనీలెద్దూ! ఏదో పెద్దది!"

"అదే నేనూ అనేది. ఆ పట్టుచీర మీద అంత కాంక్ష దేనికంటాను. ఇంట్లో పరిస్థితులన్నీ చూస్తు 'పట్టుచీరకొనిపెట్టరా నాయనా!' అనడుగుతే ఎలా కొనిస్తారనీ. విత్య పెళ్ళికి చేసిన అప్పు తీరలేదు. ఆపైన మన పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారా! వాళ్ళ చదువు సంధ్యలు చూడాలా!"

"సరెలే! ఆ పారమంతా చదవకు.

వాకు తెలియవా ఆ విషయాలు. అవిడడిగినంత మాత్రాన కొన్నామా? పెట్టామా? ఏనాటినుంచో అడుగుతూంది. కొనగలిగామా!" సూర్యం కంఠంలో బాధ ధ్వనించింది.

"ఉంటే ఒకటికాకపోతే పది కొనుక్కోవచ్చు. ఎవరొద్దన్నారు? కాస్త అవిడ కూడా పరిస్థితి ఆలోచించాలి కదా!" శాంతమాట పూర్తికాకుండానే గది బయటకు దూసుకుపోయాడు సూర్యం.

"అసలీ మనిషిని మెతకచేసి ఆడిస్తున్నారు. ఆ నాన్నగారిలా నన్ను ముట్టుకోకు అన్నట్లుంటే తెలిసేది వాళ్ళకి...!" అంటూ కుతకుతలాడిపోయింది శాంత.

* * *

"అబ్బాయ్ అమ్మగారిది పునిస్త్రీ చావు. పసుపు, కుంకం, పూలు, కొత్తచీర, గాజులు అన్నీ తెప్పించండి!" అన్నాడు పురోహితుడు.

ఏడ్చి ఏడ్చి ఎర్రబడిపోయిన కళ్ళతో అల్లంత దూరంలో కూర్చున్న భార్య వంక చూసాడు సూర్యం. శాంత మొహానికి చెంగు అడ్డంపెట్టుకొని ఏడుస్తూంది. ఆ పక్కనే నిత్య, శుభ, సత్య దుఃఖిస్తున్నారు. మాధవరావుగారు ఓ గోడకు అంటుకుపోయి కూర్చున్నారు, పుట్టెడు దుఃఖంతో.

ఆ తెల్లవారుజామున గుండెపోటుతో హఠాత్తుగా మరణించారు సుందరమ్మగారు. అంత ఆకస్మికంగా ఆవిడ మృత్యువాత పడతారని ఎవరూ అనుకోలేదు. తల్లి మరణవార్త వింటూనే దగ్గర్లోనేవున్న శుభ, సత్య భర్తలతో సహా వచ్చారు. సత్యానికి టెలిగ్రాం యిచ్చారుగాని అతను బొంబాయినుంచి రావడానికి చాలా టైంపడుతుంది. తల్లిని చివరి చూపుకైనా నోచుకోని దురదృష్టవంతుడు.

మధ్యాహ్నం పన్నెండుగంట లవు

తూంది. యింట్లో ఎవరూ వచ్చి మంచి నీళ్లు ముట్టలేదు. పిల్లలందరూ 'ఆకలి' అని గోలపెట్టసాగారు. సుందరమ్మ గారు అంతిమ యాత్రకి సన్నాహాలు జరుగుతున్నాయి.

సూర్యం పైగుడ్డతో కన్నీళ్లు తుడుచు కుంటూ "శాంతా! కొత్తచీరకోసం ఎవరి నైనా పంపావా?" అనడిగాడు భార్య దగ్గరగా వెళ్ళి.

"మీ బావ వెళ్ళారు!" శుభ చెప్పింది ఏడుస్తూనే.

ఇంతలో బయటనుంచి "పోస్ట్" అంటూ కేక వినబడి సూర్యమే వెళ్ళాడు వీధిలోకి.

"రిజిష్టరు పార్శిలుందండి మీకు!" అన్నాడు పోస్ట్‌మేన్. అతని దగ్గరే పెన్నుతీసుకుని సంతకంచేసి, పార్శిలు తీసుకున్నాడు. దానిమీద ఫ్రమ్ అడ్రసు చిట్టిబాబుది. ఆ పార్శిలేమిటో, ఎందుకు పంపాడో అర్థంకాలేదు సూర్యంకి. మనసంతా దుఃఖభారమైపోయిన ఆ సమయంలో విప్పి చూడాలనిపించలేదు. కాని, మనసు పీకేసింది. ఎప్పుడూ ఉత్తరమైనా రాయని చిట్టిబాబు రిజిష్టరు పార్శిలులో ఏం పంపాడు? వీధిలో నిలబడే పార్శిలు ఊడదీశాడు. విప్పు తూనే కళ్ళు చెదిరిపోయాయి. నిర్ఘాంత పోయాడు. పంచల చాపు, బంతిపూ రంగు పట్టుచీరకు జానెడు వెడల్పున ఆకుపచ్చని జరీఅంచు గల కంచిపట్టు చీర. అందులోనే ఉత్తరం కూడా వుంది.

"డియర్ సూర్యం!

ఇక్కడ మేము కులాసా. మీరందరూ క్షేమమని తలుస్తాను. మాస్టారి ఆరోగ్యం బాగా ఉన్నదా? రెండు నెలల క్రితం నే నక్కడికి వచ్చినప్పుడు చాలా బల హీనంగా కన్పించారు. అమ్మగారికి, నాన్నగారికి నా నమస్కారములని చెప్పు. మీ పిల్లలేమంటున్నారు?

"సూర్యం! నువ్వు మరోలా అను కోకు. మాస్టారి దగ్గర నేను 4, 5 సంవత్సరాలు చదువుకున్నాను. కాని, ఆయన ఏనాడూ నా దగ్గర పైసా కూడా జీతం తీసుకోలేదు. ఆయనకు గురు దక్షిణగా పంచలచాపు, అమ్మగారికి కంచిపట్టుచీర పంపుతున్నాను. వారికి అందజెయ్. అమ్మగారికి కంచిపట్టుచీర కొనుక్కోవాలని చాలా రోజులుగా వుందని నాకు తెలుసు. ఎలాగంటావా? నేను ఆయన దగ్గరకు ప్రైవేటుకి వచ్చే రోజులలో అమ్మగారు కంచిపట్టుచీర కోసం మాస్టారితో ఒకటి రెండుసార్లు ఘర్షణపడటం విన్నాను. పోతే, రెండు నెలల క్రితం నేనూ, దీపిక అక్కడికి వచ్చినప్పుడు తెల్పింది. ఆవిడ కా కోరిక ఇంతవరకూ తీరనేలేదని. ఆవిడ దీపిక చీరని చాలా మెచ్చుకున్నారుట.

"సూర్యం ఇది మిమ్మల్ని కించ

వరచాలని చెయ్యడంలేదు. విజానికి మనలాంటివాళ్ళు కొవగలిగే అందు బాటులో వున్నాయా పట్టుచీరలు. ఏమయినా అమ్మగారికి చీర కొనివ్వా లని నేను అక్కడకు వచ్చినప్పుడే నిశ్చయించుకున్నాను. అయితే, డబ్బు సర్దుబాటయి కొనేసరికి యిన్నాళ్ళయింది. అమ్మగారికి నువ్వెంతో, నేనూ అంతే. అలాగే ఆవిడ నాకెలాగో నీకూ అంతే. అందుకే ఈ చీర పంపుతున్నాను. మరోలా భావించవనుకుంటాను. అమ్మ గారికి రంగుచీర అంటే యిష్టమని దీపిక ఈ చీర సెలక్టు చేసింది. అమ్మగారికి నచ్చుతుందనే అనుకుంటాను. మరింక వుంటాను సూర్యం.

ఇట్లు

చిట్టిబాబు."

సూర్యం కళ్ళనుండి జలజలా రాలి పోతున్నాయి కన్నీళ్ళు, చేతిలో ఉత్తరం మీద, పట్టుచీరమీద. పిచ్చివాడిలా ఆ పట్టుచీరను, ఉత్తరంలోకి చూస్తూండి పోయాడు.

"సూర్యం! ఈ చీర చూడవోయ్. తెచ్చాను." తుథ భర్త బజారునుంచి తెచ్చిన చీరమడత విప్పి చూపించాడు.

కన్నీటి తెరల్లోంచి చూసాడు సూర్యం. ఆకుపచ్చవి వరయూరు నేత చీర. సూర్యం తనచేతిలో పట్టుచీరవంక ఆ నేతచీర వంక మార్చి మార్చి చూసాడు. చివరికి తల్లి కోరుకున్న చీరని ఆమె చావునాడయినా కొనలేక పోయాడు తను గుండెలు బ్రద్ద లయేలా వస్తోంది దుఃఖం సూర్యంకి.

సుందరమ్మగారు మరీ అరగంటలో తను కోరుకున్న బంతిపూరంగు పట్టు చీరతో ముస్తాబై, జీవితంలో చివరి గమ్యం చేరుకునేందుకు సిద్ధమైనారు. ఆవిడ మొహంలో తన చిరకాల వాంఛ తీరిందన్న తృప్తి మెరుస్తున్నట్లుగా అనిపించింది సూర్యంకి.